సాక్షి
నంద్యాల

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



మల్లన్న సేవలో పీఠాధిపతి
శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను ఆదివారం తమిళనాడు మయిలడుతురైకు చెందిన ధర్మపురం ఆధీన పీఠాధిపతి పరమాచార్య స్వామిగల్ దర్శించుకున్నారు.



అన్నదాన పథకానికి విరాళం
శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన జొన్నల గడ్డ శ్రీకాంత్ రూ.1.00.116 విరాళాన్ని అందజేశారు. దాతను జ్ఞాపికతో సత్కరించారు.



నృత్య నీరాజనం
శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్య కళావేదికపై ఆదివారం జడ్చర్లకు చెందిన అభినయ కూచిపూడి కళానిలయం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది.

న్యూస్‌రీల్

నేడు జగనన్నకు చెబుదాం - స్పందన
నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో వినూత్న తరహాలో సోమవారం 'జగనన్నకు చెబుదాం - స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఈ కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నా రు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా 'ఈ కార్యక్రమాన్ని నిర్వహిసున్నామన్నారు.

నేటి పోలీసు స్పందన తాత్కాలిక రద్దు
బొమ్మలసత్రం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన పోలీసు స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదివారం తెలిపారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి జిల్లా పోలీసు కార్యాలయానికి రావొద్దని, వారి పరిధిలోని పోలీసు స్టేషన్‌లు, సీఐ, డీఎస్పీ కార్యాలయాలలో యథాతథంగా నిర్వహించే పోలీసు స్పందనలో వినతులు అందజేయాలని సూచించారు.

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): నంద్యాల పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. పట్టణంలోని చిన్మయ మిషన్ విద్యాలయం, ఆర్టీసీ బస్టాండ్ సమీపాల్లోని పోలింగ్ స్టేషన్ నెం.35, 36, 37, 38, 39 పోలింగ్ కేంద్రాలు, నంద్యాల మండలం వెంకటేశ్వరపురం గ్రామ ఎంపీపీ స్కూల్ లోని 201 నంబరు పోలింగ్ కేంద్రం, పోలూరు గ్రామ ఎంపీపీ స్కూల్ లోని 1, 2 పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి డీఈఓ సుధాకర్ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

గడప గడపకూ అభివృద్ధి

- గ్రామాల్లో ఊపందుకున్న అభివృద్ధి పనులు
- జిల్లాకు రూ.5,774.89 లక్షలు మంజూరు
- 1,154 పనులకు అనుమతులు
- 29 మండలాల్లో 545 పనులు పూర్తి



యాళ్లూరులో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు



గడివేములలో నిర్మించిన డ్రైనేజీ

గోస్పాడు: జన రంజక పాలన సాగిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పల్లె ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నారు. ఓ వైపు సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకుంటూ మరో వైపు పల్లెల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇప్పటికే గ్రామ స్వరాజ్యం దిశగా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువచేసేందుకు వలంటీర్లను నియమించారు. గత ప్రభుత్వాల హయాంలో పల్లెలు అభివృద్ధికి దూరమయ్యాయి. అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, మంచినీటి పథకాలు లేక ప్రజలు కొన్ని దశాబ్దాలుగా అవస్థలు పడ్డారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామాల్లో ప్రగతి కుసుమాలు విరబూశాయి. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజీ హెల్త్ క్లినిక్‌లు.. ఇలా ఎన్నో శాశ్వత భవనాలు వెలిశాయి. ఈ క్రమంలోనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. దీంతో ఆ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల వద్దకే వెళ్లారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును లబ్ధిదారుల నుంచి తెలుసుకుంటూనే గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవ చూపారు. ప్రభుత్వం నుంచి వెంటనే నిధులు కేటాయించి పనులు చేపట్టారు. సచివాలయం వేదికగా అభివృద్ధి పనులు పూర్తిచేస్తూ ఎప్పటికప్పుడు సమస్యల తీవ్రతకు అడ్డుకట్ట వేస్తూ సుపరి పాలన సాగిస్తున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా 1,154 పనులను గుర్తించి వాటికి రూ. 5,774.89 లక్షల నిధులతో పనులు చేపట్టారు.

ఒక్కొక్క సచివాలయానికి రూ. 20 లక్షలు
గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాలలోని ప్రజలు తమకు అవసరమైన అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే నిధులను కేటాయించి ఆయా పనులను పూర్తి చేసే చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏ గ్రామంలో అయితే పూర్తి అవుతుందో ఆ గ్రామంలో వెంటనే ఏ ఏ పనులు నిర్వహించాలో, వాటికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని స్థానిక సచివాలయ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అనంతరం ఆ పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ పనులు చేపడుతోంది. ఇది ఇలా ఉండగా గ్రామీణ ప్రాంతాల రహదారుల ప్రగతికి జిల్లాలోని ఒక్కొక్క మండలానికి రూ.60 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. 271 పనులు చేపట్టినట్లు రూ. 15.06 కోట్లతో సీసీ రోడ్లు, మురికి కాలువలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

జిల్లాలో శరవేగంగా పనులు
పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన గడపకు గడపకు మన ప్రభుత్వం కింద జిల్లాలో గ్రామ సచివాలయాల పరిధిలో చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటిలో అధిక భాగం రోడ్ల నిర్మాణాలు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు సాగుతున్నాయి. జిల్లాలో 1,154 పనులకు రూ.5774.89 లక్షల నిధుల అంచనాతో ప్రభుత్వం వాటిని మంజూరు చేసింది. అయితే ఈ పనుల్లో ఇప్పటికే 545 పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన వాటిలో 32 పనులు టెండర్ దశలో ఉండగా,153 పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. రూ. 5 లక్షల లోపు ఉన్న 326 పనులు నామినేషన్ పనులుగా గుర్తించి చేపడుతున్నారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.1,341.51 లక్షలు పనులు చేపట్టిన వారి అకౌంట్లలో జమ చేశారు. మరో 224 పనులకు సంబంధించి రూ.960 లక్షలకు బిల్లులు అప్‌లోడ్ చేశారు.

జిల్లాకు మంజూరైన పనుల వివరాలు ఇలా

నియోజకవర్గం	మంజూరైన పనుల సంఖ్య	నిధులు రూ. లక్షల్లో	పూర్తయిన పనులు
బనగానపల్లె	95	1,022.38	55
డోన్	175	771.95	134
నందికొట్కూరు	216	982.4	132
ఆళ్లగడ్డ	273	1,257.65	79
నంద్యాల	215	1,015.96	38
ఆత్మకూరు	180	724.55	107



డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

రహదారి సమస్య తీరింది



కాలనీలో ఎంతో కాలంగా సరైనా వసతులు లేక అవస్థలు పడాల్సి వచ్చేది. కాలనీలో ఉన్న రహదారి సక్రమంగా లేక వర్షాకాలంలో చిన్నపాటి జల్లులు కురిసిన మురికినీటి కుంటలను తలపించేలా ఉండేది. కాలనీ వాసుల పరిస్థితి ఎంతో అధ్వానంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలనీలో రోడ్లు, మురికి కాలువలు ఏర్పాటు చేయడంతో ఎంతో కాలంగా ఉన్న సమస్య పరిష్కారమయ్యాయి.

– యశ్వంత్, జూలేపల్లె

గతంలో ఊరికొచ్చేవారే కాదు



గతంలో పాలకులు, అధికారులు ఇంటింటికీ తిరగలేదు. ప్రజా సమస్యలను పట్టించుకోలేదు. ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజలకు కనిపించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఊరికొచ్చి సమస్యను తెలుసుకుని వెంటనే నిధులు మంజూరు చేస్తున్నారు. మా ఊరిలో అధ్వాన్నంగా ఉన్న మట్టి రోడ్లు ఇప్పుడు బాగుపడుతున్నాయి.

– గోకారమ్మ, గోస్పాడు

గడువులోగా పనులు పూర్తి



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికి కాలువలు ఏర్పాటు చేసేలా పనులు నిర్వహిస్తున్నాం. జిల్లాలో చేపట్టిన 1,154 పనుల్లో ఇప్పటికే 545 పనులు పూర్తి చేశాం. మిగిలిన పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. పనులు చేసిన వాటిలో రూ.1341.51 లక్షల బిల్లులు ప్రభుత్వం చెల్లించింది. పనుల్లో నాణ్యత ఉండేలా పర్యవేక్షణ చేస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం.

– రామ్మోహన్, జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీరింగ్ అధికారి

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు



న్యూక్లియర్ కాలేజీ పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరిగిన గ్రూపు-2 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాలలోనికి తీసుకెళ్లకుండా పకడ్బందీగా తనిఖీలు చేశారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లు మూసి వేయించారు. జిల్లాలో 44 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 85.05 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలకు 14,670 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 12,478 మంది హాజరయ్యారు. 2,192 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పట్టణంలోని పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. న్యూక్లియర్ కాలేజ్, నారాయణ కాలేజ్, వెంకటేశ్వర కాలేజ్, రామకృష్ణ డిగ్రీ కాలేజ్, నేషనల్ జూనియర్, డిగ్రీ కాలేజ్, శాంతినికేతన్ స్కూల్ తదితర సెంటర్ల వద్ద బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకుని పరిశీలించారు.

నేడు రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల ప్రారంభం
నంద్యాల(సిటీ): నంద్యాల రైల్వే స్టేషన్‌లో పలు అభివృద్ధి పనులను సోమవారం దేశ ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని నంద్యాల రైల్వే స్టేషన్ మాస్టర్ దొరస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు డివిజన్ పరిధిలోని 13 స్టేషన్లు అమృత్ భారత్ స్టేషన్ స్కీంకు ఎంపికయ్యాయని, అందులో నంద్యాల జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను రూ.21.80 కోట్లతో పలు ఆధునీకరణ పనులు పూర్తయ్యాయన్నారు. ఈ పనులను సోమవారం పీఎం మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పెద్దాసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

- వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధాని మోదీ

కర్నూలు (టౌన్): ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 23.75 కోట్లతో నిర్మించనున్న 50 బెడ్ల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు ఆదివారం వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్ నుంచి ఈ కార్యక్రమానికి ప్రధాని శ్రీకారం చుట్టారు. స్థానిక వైద్య కళాశాలలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్టక్చర్ మిషన్‌లో భాగంగా పెద్దాసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ బ్లాక్ ద్వారా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో వచ్చే వారికి తక్షణ ఆరోగ్య సేవలు అందుతాయన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, వైద్యానికి పెద్ద పీట వేశాయన్నారు. కర్నూలు పెద్దాసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తుందన్నారు. అనంతరం క్రిటికల్ కేర్ బ్లాక్‌కు సంబంధించిన పైలాన్‌ను కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే కాటాసాని రాంభూపాల్ రెడ్డి, వైద్యాధికారులు కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రామగిడ్డయ్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా దీక్ష విరమణ



హోమం నిర్వహిస్తున్న దీక్షాదారులు

ఆళ్లగడ్డ: నియమ నిష్ఠలతో శ్రీ అహోబిల లక్ష్మీనారసింహ స్వామి దీక్ష చేపట్టిన భక్తులు ఆదివారం భక్తి శ్రద్ధలతో దీక్ష విరమణ చేశారు. దీక్ష చేపట్టి మండలం (41) రోజులు పూర్తి కావడంతో దీక్ష విరమించేందుకు శనివారం సుదూర ప్రాంతాల నుంచి దీక్షాదారులు కాలినడకన అహోబిలం క్షేత్రం చేరుకున్నారు. తెల్లవారు జామున ఎగువ దిగువ అహోబిల ఆలయాల్లో పుణ్య స్నానం ఆచరించి కాలినడకన మాలోల లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి చేరుకుని ఇరుముడి స్వామికి సమర్పించి దీక్ష విరమించారు. ఆలయ సమీపంలో వేదపండితులు ఆధ్వర్యంలో నిర్వహించిన సుదర్శన హోమంలో పాల్గొన్నారు. దీక్షాదారులతో పాటు వారి కుటుంబ సభ్యులు తండోపతండాలుగా తరలిరావడంతో అహోబిలం క్షేత్రం గోవింద నామస్మరణతో పులకించి పోయింది.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు



కేసీ కెనాల్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పట్టణ ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం వీబీఆర్ నుంచి కేసీ కెనాల్‌కు విడుదల చేసిన నీటిని ఆదివారం కమిషనర్ పరిశీలించారు. విద్యుత్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్,పోలీసు తదితర శాఖల అధికారులతో కలసి ఆయన కేసీ వెంట పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగోడు నుంచి కేసీ ద్వారా తరలిస్తున్న నీటినిఅనధికారికంగా రైతులు పొలాలకు మళ్లిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నీరు నంద్యాలకు చేరేలా రైతులు సహకరించాలని కోరారు.

పరీక్షకు సన్నద్ధం.. ప్రతిభకు ప్రోత్సాహం

- 10వ తరగతి, ఇంటర్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- అత్యధిక మార్కుల సాధనకు పకడ్బందీ ప్రణాళిక
- ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు
- 'జగనన్న ఆణిముత్యాల' స్ఫూర్తి నింపుతున్న వైనం



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌ఈ ప్యానల్ ద్వారా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

నంద్యాల(న్యూటౌన్): చదువుతోనే విద్యార్థుల భవిత మారుతుందని, సామాజిక ప్రగతి సాధ్యమవుతుందన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసింది. పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు అమ్మ ఒడి మొదలు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఈ క్రమంలో ఏటా జరిగే పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు 'జగనన్న ఆణి ముత్యాలు' కింద నగదు ప్రోత్సాహకాలు అందజేస్తోంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సత్కరిస్తోంది. పాఠశాలలకు జ్ఞాపికలు అందజేస్తోంది. దీంతో ఉత్తమ ఫలితాల సాధనకు పాఠశాల యాజమాన్యాలు పోటీ పడుతున్నాయి. ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దుతున్నారు. మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్, మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గతేడాది జగనన్న ఆణిముత్యాలు' కింద పదో తరగతిలో ప్రతిభావంతులైన మొదటి ముగ్గురికి, ఇంటర్మీడియెట్‌లో అధిక మార్కులు సాదించిన గ్రూపునకు ఒక్కరి చొప్పున నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నగదు అవార్డులను అందజేసింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, చదువు చెప్పే గురువులను సత్కరించింది. పాఠశాలల పనితీరును ప్రశంసించింది. ఈ ఏడాది కూడా అదే గౌరవాన్ని పొందేందుకు, ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని అంది పుచ్చుకునేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సమష్టిగా చదువుల యజ్ఞం సాగిస్తున్నారు. అధిక మార్కుల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

గతేడాది ఆణిముత్యాలు వీరే..
గతేడాది పదో తరగతిలో నియోజకవర్గాల స్థాయిలో అధిక మార్కులు సాధించిన వారిలో హర్షిత (587 మార్కులు, జెడ్పీహెచ్ఎస్, కోవెలకుంట్ల), సుభాన్ (585 మార్కులు, జెడ్పీహెచ్ఎస్, ఆత్మకూరు), సాయిసంతోషి (583 మార్కులు, జెడ్పీహెచ్ఎస్, అవుకు), రాణి (573 మార్కులు ఏపీ సోషల్ వెల్ఫేర్ స్కూల్, డోన్), కేతశోని (563 మార్కులు, ఏపీ సోషల్ వెల్ఫేర్ స్కూల్, ఆళ్లగడ్డ) తదితరులు ఉన్నారు.

- ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన పూజిత (949 మార్కులు, బాలికల ప్రభుత్వ జూనియర్, నంద్యాల), మౌనిక (932 మార్కులు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, నంద్యాల), హుసేన్‌బీ (933 మార్కులు, పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నంద్యాల), సుమలత (971 మార్కులు, శ్రీశైలం మోడల్ స్కూల్, నంద్యాల), తదితర విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. వీరి స్ఫూర్తితో ఈ ఏడాది కూడా అధిక మార్కుల సాధనకు విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదువుతున్నారు.

అవార్డులు ఇలా...
పదో తరగతిలో నియోజకవర్గ స్థాయిలో అధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు రూ.15 వేలు, రూ. 10 వేలు, రూ.5 వేలు చొప్పున, జిల్లా స్థాయిలో రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తుంది. విద్యార్థులకు మెడల్‌తో పాటు వారి తల్లిదండ్రులు, పాఠశాల హెచ్‌ఎంను సత్కరిస్తుంది. పాఠశాలకు ప్రత్యేకంగా ఓ జ్ఞాపికను అందజేస్తోంది. ఇంటర్మీడియెట్‌లో అయితే ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ/ఎంఈసీ గ్రూపుల్లో టపర్లకు నియోజకవర్గ స్థాయిలో రూ. 15 వేలు, జిల్లా స్థాయిలో రూ.50 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.లక్ష చొప్పున అందజేస్తుంది.

పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల వివరాలు

తరగతి	విద్యార్థుల సంఖ్య
పదో తరగతి	30,295
ఇంటర్ (ప్రథమ)	13,553
ఇంటర్ (ద్వితీయ)	14,846

ప్రథమ స్థానంలో నిలుస్తాం



గతేడాది పదో తరగతి ఫలితాల్లో నంద్యాల జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో ఉండేలా చర్యలు చేపట్టాం. ప్రతి ఉన్నత పాఠశాలను అధికారులు దత్తత తీసుకున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యార్థుల్లో బోధనా సామర్థ్యాలను పరీక్షిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తున్నాం.

– సుధాకర్‌రెడ్డి, డీఈఓ, నంద్యాల

సబ్జెక్టుపై పట్టు సాధించేలా



విద్యార్థులు ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించేలా పాఠ్యాంశాలపై అవగాహనాయుత బోధన అందిస్తున్నాం. సులభంగా పరీక్షలు రాయగలిగేలా తీర్చిదిద్దుతున్నాం. సందేహాలను వెంటనే నివృత్తి చేస్తున్నాం. పాఠశాలలో ప్రత్యేక స్టడీ అవర్లను నిర్వహిస్తున్నాం. ఎన్నడూ లేని విధంగా చదువులో ప్రతిభ చూపే విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నగదు అవార్డులు అందుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం.

– సుధాకర్, చాపిరేవుల, ఉపాధ్యాయులు

అధిక మార్కులు సాధిస్తా



మా పాఠశాలలో ఉపాధ్యాయులంతా చక్కగా బోధిస్తున్నారు. తరగతి గదిలో ఐఎఫ్ టీవీల ద్వారా డిజిటల్ బోధనను అందిస్తున్నారు. సబ్జెక్టులకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేస్తున్నారు. గతంతో పోల్చితే పాఠశాలలో విద్యాబోధన మెరుగుపడింది. ట్యాబ్‌ల ద్వారా ఇళ్ల వద్దనే పాఠ్యాంశాలు వింటూ చదువుకుంటున్నాం. ఈ ఏడాది పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తానన్న నమ్మకం ఉంది. జగనన్న ఆణిముత్యాలు అవార్డును అందుకుంటాననే నమ్మకం ఉంది.

– ప్రవల్లిక, పదవ తరగతి విద్యార్థిని, చాపిరేవుల

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



మృతి చెందిన హసీనా

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఎస్‌ఐ వరప్రసాద్ అందించిన సమాచారం మేరకు.. బనగానపల్లె మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన షేక్ ఉసేన్‌సాకు పదేళ్ల క్రితం పాణ్యం మండలం కొణిదేడు గ్రామానికి చెందిన షేక్ హసీనా(25)తో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. భార్య, భర్తలు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కూలీ పనుల నిమిత్తం హసీనాతో పాటు ఎనిమిది కూలీలు మిరప కోత పనులకు కోవెలకుంట్ల మండలం సొదరదిన్నెకు ఆటోలో బయలుదేరారు. గ్రామ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో హసీనా తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఆమెను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తల్లి మందలించిందని..



మృతి చెందిన బాలుడు అబ్దుల్ మునాఫ్

బేతంచెర్ల: ఎక్కువగా సైకిల్ తొక్కొద్దు అని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన నాలుగో తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బేతంచెర్ల పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలో సుబ్బారెడ్డి నగర్ కాలనీ చెందిన సయ్యద్ బాషా, ఖాదర్‌బీ దంపతులకు ఏకైక సంతానం అబ్దుల్ మునాఫ్ (9). పట్టణంలోనే నాల్గొవ తరగతి చదువుతున్నాడు. ఎక్కువ సమయం సైకిల్ తొక్కడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కొద్దిసేపటికి ఇంటికొచ్చిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న అబ్దుల్ మునాఫ్‌ను స్థానిక శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కొగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది.

భక్తి శ్రద్ధలతో పూజలు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలో పార్వేట ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహ స్వామి, ప్రహ్లాదవరద స్వామి వారికి గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పార్వేట ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తుల పల్లకీ ఆదివారం చంద్రునిపేట, పడమటివీధి, బొరుగుల పేటలోని పలు తెలుపుల మీద కొలువుదీరగా ఆయా కాలనీల ప్రజలు దర్శించుకున్నారు. స్వామి వారి రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

27న జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 27న జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ జట్టును ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు కుబేర్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 85 కేజీలలోపు బరువు ఉన్న క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 3వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9966998818ను సంప్రదించాలన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- భక్తుల రద్దీ దృష్ట్యా ఉచిత, రూ.200, రూ.500 క్యూలైన్లు
- శివస్వాములకు ప్రత్యేక క్యూలైన్
- ఉచిత కంపార్ట్‌మెంట్లలో 10వేల మంది భక్తులు వేచి ఉండేలా ఏర్పాట్లు
- భక్తులకు నిరంతరం తాగునీరు, బిస్కెట్లు, అల్పాహారం పంపిణీ



ఉచిత దర్శన క్యూలైన్లు



శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీగిరిలో అత్యంత వైభవంగా నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తండోపతండాలుగా తరలిరానున్నారు. శ్రీశైల మల్లన్నను కనులారా చూసి, మనసారా దర్శించుకుని, బ్రహ్మోత్సవాలను తిలకించి పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహంతో ఆనందంతో భక్తులు తిరుగు పయనమవుతారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచే శ్రీగిరికి భక్తుల తాకిడి పెరుగుతుంది. భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా దేవస్థాన ఈఓ డి. పెద్దిరాజు ఇప్పటికే పలు మార్లు సమీక్ష సమావేశాలను సైతం ఏర్పాటు చేసి ఆయా విభాగాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్ రెడ్డి బ్రహ్మోత్సవ సమన్వయ సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉన్నతాధికారుల సూచన మేరకు దేవస్థాన అధికారులు ఏర్పాట్లలో నిమగ్నయ్యారు.

భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు విచ్చేసే భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. ఇందుకోసం మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు సాధారణ భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. అలాగే జ్యోతిర్ముడి కలిగి ఉన్న శివస్వాములకు మార్చి1 నుంచి 5వ తేదీ వరకు మాత్రమే విడతల వారీగా స్పర్శదర్శనాన్ని కల్పిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఉచిత దర్శనానికి 17 కంపార్ట్‌మెంట్లు

శ్రీశైల మల్లన్నను సామాన్య భక్తులు ఉచితంగా దర్శనం చేసుకునేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. దేవస్థానంలో ఉచిత క్యూలైన్ భక్తులు వేచి ఉండేందుకు 17 కంపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటిలో 7,200 మంది భక్తులు వేచి ఉండే అవకాశం ఉంది. అలాగే క్యూలైన్లలో నిలబడి వేచి ఉండేందుకు 2,900మందికి అవకాశం ఉంది. మొత్తానికి ఉచిత క్యూకంపార్ట్‌మెంట్లు, క్యూలైన్ల ద్వారా 10,100 మంది భక్తులు దర్శనం చేసుకునే వీలు ఉంది.

శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్లు:

ఉచిత దర్శనంతో పాటు దేవస్థానం శీఘ్ర (రూ.200), అతిశీఘ్ర (రూ.500) దర్శనం టికెట్లను ఆన్‌లైన్ ద్వారా, కరెంట్ బుకింగ్ ద్వారా అందుబాటులో ఉంచింది. శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్లలో భక్తులు వేచి ఉండేందుకు 8 కంపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఆయా కంపార్ట్‌మెంట్లలో సుమారు 3,360 మంది భక్తులు వేచి ఉండే అవకాశం ఉంది. క్యూలైన్లలో 650 మంది భక్తులు వేచి ఉండే అవకాశం ఉంది. మొత్తం 4,010 మంది భక్తులు శీఘ్ర, అతిశీఘ్ర క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకునే అవకాశం ఉంది.

వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూ

బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లుల కోసం దేవస్థానం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసింది. మొత్తం నాలుగు క్యూలైన్లు ఉండగా ఆయా క్యూలైన్లలో 1,200 మంది భక్తులు వేచిఉండే అవకాశం ఉంది. అలాగే ఆలయంలో లోపల 1,700 మంది భక్తులు పట్టే నాలుగు క్యూలైన్లు ఉన్నాయి.

శివస్వాములకు నాలుగు కంపార్ట్‌మెంట్లు..

శివస్వాములకు చంద్రవతి కల్యాణ మండపంలో ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేశారు. చంద్రవతి కల్యాణ మండపంలో మొత్తం 4 కంపార్ట్‌మెంట్లలో 6,700 మంది భక్తులు వేచి ఉండేలా ఏర్పాట్లు చేశారు. అలాగే క్యూలైన్లలో 3వేల మంది భక్తులు వేచి ఉండేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉచిత, రూ.200, రూ.500 క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు నిరంతరం తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ చేస్తారు.

పాదయాత్ర భక్తులకు మెరుగైన వసతులు



పెద్ద చెరువు ప్రాంతం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పాదయాత్రగా తరలివచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అధికారులను ఆదేశించారు. ఆదివారం నాగలూటి, పెద్దచెరువు ప్రాంతాల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. మంచినీటి సదుపాయం, అన్నదానం, మార్గసూచికల ఏర్పాటు, వైద్యశిబిరాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. నాగలూటి వద్ద గల కోనేరును శుభ్రపరచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ అటవీశాఖ సహకారంతో నాగలూటి వద్ద భక్తులు సేద తీరేందుకు వీలుగా జంగిల్ క్లియరెన్స్ చేపట్టామన్నారు. పెద్దచెరువు వద్ద గత సంవత్సరం కంటే అదనంగా చలువ పందిళ్లు వేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వెంకటాపురం, పెద్దచెరువు, దాయర్లగుంటలలో గతంలో కంటే అధికసంఖ్యలో తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. గత సంవత్సరం కంటే 20శాతం మేర అధిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. నాగలూటి, పెద్దచెరువు ప్రాంతాలకు అధికసంఖ్యలో వాటర్ ట్యాంకర్లను పంపాలని నీటిసరఫరా విభాగాన్ని ఆదేశించారు. ఈఓ వెంట దేవస్థాన ఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈ రంగప్రసాద్, అటవీశాఖ రేంజ్ అధికారి దొరస్వామి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అందరూ ధర్మ మార్గంలో నడవాలి

- కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతీ స్వామి



భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తున్న పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

మహానంది: ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో నడవాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. విజయయాత్రలో భాగంగా మహానంది క్షేత్రానికి చేరుకున్న ఆయనకు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేద పండితులు రవిశంకర అవధాని, పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మహానందిలోని పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో ఆదివారం రాత్రి అనుగ్రహ భాషణం నిర్వహించారు. హిందూ ధర్మపరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో ధర్మం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ అధర్మాన్ని వీడి సత్యమార్గంలో నడవాలని కాంక్షించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచి సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించాలన్నారు. . హిందూ ధర్మంలో భగవంతుడి ఆరాధన ఎంతో కీలకమని, ప్రతి ఆలయంలో నిత్యం పూజలు జరుగుతుంటే ఆ గ్రామం, ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందన్నారు. మహానంది ఆలయం ఎంతో మహిమాన్వితమైనదని అన్నారు. స్వయంభువుగా వెలిసిన శ్రీ మహానందీశ్వరస్వామి పశ్చిమాభిముఖంగా ఉంటూ భక్తుల కోరికలు నెరవేరుస్తున్నారన్నారు. అనంతరం రాత్రి స్థానిక అభిషేక మండపంలో శ్రీ శారదా సమేత శ్రీ చంద్రమౌళీశ్వర పూజలు నిర్వహించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, మాజీ చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, తదితరులు పీఠాధిపతి ఆశీస్సులు అందుకున్నారు.

మండపానికి నేడు భూమిపూజ

మహానందిలో స్వామివారి నిశ్చితార్థ మండపం నిర్మాణానికి సోమవారం పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి భూమి పూజ చేయనున్నారు. పురాతనమైన మండపం తొలగించిన విషయం తెలిసిందే. దాని స్థానంలో నూతనంగా నిర్మించనున్న మండప నిర్మాణానికి భూమి పూజ ఉంటుందని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన ఎరుకలి సాయి కృష్ణ (ఫైల్)

బేతంచెర్ల: పట్టణంలోని ఎరుకలి పేట కాలనీకి చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎరుకలి సుంకన్న, మంగమ్మ దంపతులు వృత్తి రీత్యా తాళ్లు అమ్మేందుకు శనివారం ప్యాపిలికి వెళ్లారు. వారు ఆదివారం ఉదయం స్థానిక గ్యాస్ ఏజెన్సీలో పని చేసే కుమారుడు సాయి కృష్ణ (26)కు ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో అనుమానంతో పక్కనే బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు ఇంటి వద్దకు వెళ్లి ఎంత పిలిచినా స్పందించకపోవడంతో తలుపులు పగులగొట్టి చూడగా సాయి కృష్ణ ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పోలీసులకు తీవ్ర గాయాలు

- తన వాహనంలో ఆసుపత్రికి తరలించిన డీఐజీ

కర్నూలు: ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో విధులు ముగించుకుని కర్నూలుకు వస్తున్న బాంబు డిస్పోజల్ టీమ్ సభ్యులు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు సీవీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏవీ రామిరెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం జాతీయ రహదారి మీద ద్విచక్రవాహనంపై కర్నూలుకు వస్తుండగా నన్నూరు టోల్‌ప్లాజా వద్ద గుర్తు తెలియని ద్విచక్రవాహనం వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు అన్నమయ్య జిల్లాకు వెళ్లి ఇన్‌స్పెక్షన్ పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న సమయంలో రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదం చూసి తన వాహనాన్ని ఆపి గాయాలకు గురైన కానిస్టేబుల్‌ను స్వయంగా తన వాహనంలో ఎక్కించుకుని కర్నూలు మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం చేయించి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రమాదానికి కారుకుడైన ద్విచక్రవాహనదారుని కోసం ఓర్వకల్లు పోలీసులు గాలిస్తున్నారు.

అన్నపై తమ్ముడి దాడి

- పరిస్థితి విషమం



గాయపడిన తాహెర్‌వలీ

ఆదోనిరూరల్: మండలంలోని పాండవగల్ గ్రామానికి చెందిన తాహెర్‌వలీ అనే వ్యక్తిపై సొంత తమ్ముడే దాడి చేశాడు. దీంతో తాహెర్‌వలీ పరిస్థితి విషమంగా ఉంది. పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య తెలిపిన వివరాల మేరకు.. పాండవగల్ గ్రామానికి చెందిన ఇస్మాయిల్ అనే వ్యక్తికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మొదటి కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు కుమారులైన తాహెర్‌వలీ, దాదాహుసేన్ ఆస్తి కోసం తరుచూ గొడవలు పడేవారు. శనివారం అర్ధరాత్రి తాహెర్‌వలీ ఇంట్లో నిద్రిస్తుండగా తమ్ముడు దాదాహుసేన్ ఐరన్‌రాడ్‌తో దాడి చేశాడు. తాహెర్‌వలీకి తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. తాహెర్‌వలీ తండ్రి ఇస్మాయిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హోరాహోరీగా గార్ధభాల పోటీలు



పోటీలో పాల్గొన్న గార్ధభం

నంద్యాల వ్యవసాయం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జంబులాపరమేశ్వరి ఆలయ తిరునాల సందర్భంగా ఆదివారం గాడిదల పందేలు హోరాహోరీగా సాగాయి. తిరునాల ముగింపు రోజున పందేలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. నంద్యాల, ఆళ్లగడ్డ, రుద్రవరం, చాగలమర్రి, వెలుగోడు, ఆత్మకూరు, మహానంది మండలాల నుంచి ఎనిమిది గాడిదలు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీలను ఆలయ ప్రధాన కార్యదర్శి గాండ్ల జగన్‌మోహన్, పరమేశ్వర రెడ్డి, జిల్లెల్ల శ్రీరాములు ప్రారంభించారు. 120 కేజీల బరువైన ఇసుక బస్తాలతో 10 నిమిషాల్లో ఎక్కువ దూరం వెళ్లే గార్ధబాన్ని విజేతగా ప్రకటించారు. ఈ పోటీలను తిలకించడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. పోటీల్లో పెద్దపాములేటికి చెందిన గార్ధభం 5,819 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి అందుకుంది. రెండవ బహుమతిగా చాకలి అంజి, మూడవ బహుమతిగా కళ్యాణికి చెందిన గార్ధభాలు దక్కించుకున్నాయి.

కోళ్ల రక్త నమూనాల సేకరణ



రోళ్లపాడు బట్టమేక పక్షి కేంద్రంలో శ్యాంపుల్స్ సేకరిస్తున్న పశువైద్య సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): ప్రమాదకరమైన బర్డ్‌ఫ్లూ వైరస్ నెల్లూరు జిల్లాలో వెలుగు చూసిన నేపథ్యంలో జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారులు కోళ్లు, బాతులు, ఇతర పక్షుల రక్తనమూనాలు సేకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 40 రక్త నమూనాలు సేకరించాలనేది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 30 శ్యాంపుల్స్ సేకరించారు. మిడుతూరు మండలంలోని రోళ్లపాడు బట్టమేక పక్షి కేంద్రంలో పశుసంవర్ధకశాఖ అధికారులు పక్షుల నుంచి 24 శ్యాంపుల్స్ సేకరించారు. నంద్యాలలో బాతుల నుంచి, ఆలూరు, కర్నూలు రూరల్ మండలంలో కోళ్లలో రక్త నమూనాలు సేకరించారు. రిజర్వాయర్లకు వలస పక్షులు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల్లోని కోళ్ల నుంచి కూడా రక్త నమూనాలు సేకరిస్తున్నారు. సోమ, మంగళవారాల్లో వెలుగోడు రిజర్వాయర్, కర్నూలు శివారులోని గార్గేయపురం చెరువు సమీపంలోని కోళ్ల పారాల్లో శ్యాంపుల్స్ సేకరించారు. జిల్లాలో ఇంతవరకు అనుమానిత ఘటనలు చోటుచేసుకోలేదని జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రవిబాబు తెలిపారు. వ్యాధిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కోడి మాంసం, గుడ్లను 70 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత వద్ద ఉడికించి తినాలని సూచించారు.

ప్రొటెక్షన్ వాచర్‌పై చిరుత దాడి

- యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన అజీమ్‌బాషా

మహానంది: అటవీశాఖలో ప్రొటెక్షన్ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్న మహానందిలోని పార్వతీపురం కాలనీకి చెందిన అజీమ్‌బాషాపై చిరుతపులి దాడి చేసింది. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. నల్లమలలోని బైరేనీ సెక్షన్, లెపర్డ్ బేస్ క్యాంపులో ప్రొటెక్షన్ వాచర్‌గా అజీమ్ బాషా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో ఉండగా చిరుతపులి దాడి చేయడంతో తల నుదురు, మెడ భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అజీమ్ బాషాను 108 వాహనం ఈఎంటీ రాజయ్య, పైలట్ దస్తగిరి వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అజీమ్ పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు వారు తెలిపారు.

బంగారు పళ్లెం బహూకరణ



బంగారు పళ్లెంను బహూకరిస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి ఆదివారం చెన్నైకు చెందిన కోనేరు విమాలాదేవి, ఆమె కుటుంబ సభ్యులు బంగారు పళ్లెమును బహూకరించారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజుకు ఈ విరాళాన్ని అందించారు. 343 గ్రాములతో ఈ బంగారు పళ్లెమును తయారు చేయించినట్లు దాతలు తెలిపారు. విరాళాన్ని అందించిన దాతను దేవస్థాన తరపున స్వామివారి శేషవస్త్రాన్ని,లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం.హరిదాసు, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు. మార్కండేయశాస్త్రి, సీనియర్ వేదపండితులు గంటి రాధకృష్ణ, పర్యవేక్షకులు జి.స్వాములు పాల్గొన్నారు.


చౌడమ్మా.. దీవించమ్మా!

- వైభవంగా చౌడేశ్వరీ దేవి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీ దేవి

కోడుమూరు రూరల్: శ్రీచౌడేశ్వరీ దేవి తిరుణాల సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవం కనుల పండువగా సాగింది. రథానికి శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, కోడుమూరు ఎస్‌ఐ బాల నరసింహులు, దైవచార అటకార సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథంలో అమ్మవారి ఉత్సవమూర్తి అధిష్ఠింపజేసి రథోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోడుమూరు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అశేష జనవాహిని మధ్య సాగుతున్న రథోత్సవ దృశ్యం